క్లుప్తంగా

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


పీవీ నారాయణ రెడ్డి


పి.రామయ్య

మైదుకూరు : మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.రామయ్య, మహిళా విభాగం కార్యదర్శిగా సోమేసుల సుచిత్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆధార్ అప్‌డేషన్‌కు ప్రత్యేక క్యాంపులు

బద్వేలు : కేంద్ర ప్రభుత్వం నిర్దేశకాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు చేపడుతున్నామని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ప్రజల వద్దకే గ్రామాల్లోకి వెళ్లి చేపడుతున్నామన్నారు. మండలంలోని చిన్నయ్యశాల, కవలకుంట్ల, రంగసముద్రం, పోరుమామిళ్ల సచివాలయాల పరిధిలోని ఆధార్ కేంద్రాల ద్వారా దాదాపు 500 మందికి పైగా ఆధార్ కార్డులు అప్‌డేషన్ చేశామన్నారు. ఈ క్యాంప్‌లను ఈనెల మొదటి విడతగా 20, 21వ తేదీల్లో రెండో విడత 27, 28, 29 వరకు చేపట్టామని వివరించారు. బుధవారంతో ముగిశాయని రోజు సగటున ఒక్కో కేంద్రం 30 మందికి ఆధార్ అప్‌డేషన్, బయోమెట్రిక్ అప్‌డేషన్ వంటి సర్వీసులు చేశామ, ప్రజలూ వీటిని సమర్థంగా వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఏప్రిల్ నెలలో మరో విడత గ్రామాల్లోనే ప్రత్యేక క్యాంపులు చేపడతామన్నారు.

కార్యదర్శిగా ఏరువ లక్ష్మిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు డివిజన్ కల్యాణ మండపాల యాజమాన్య సంఘం కార్యదర్శిగా రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ఏరువ లక్ష్మిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో అధ్యక్షుడుగా డాక్టర్ ఎం.త్యాగరాజరెడ్డి, ఉపాధ్యక్షుడుగా సందు శివనారాయణ, సహాయ కార్యదర్శిగా ఎస్.చాంద్‌బాషాలను ఎన్నుకున్నారు.

డీటీకి వినతి

ప్రొద్దుటూరు : పాన్ కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం వేసిందని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డిని కలిసి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. పాన్‌కార్డుతో ఆధార్ అనుసంధానికి రూ.1000లు వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. పేదల నుంచి రూ.1000 వసూలు చేయడం అన్యాయమన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలి

బద్వేలు : విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు పాఠశాల దశ నుంచే కష్టించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలోని సెయింట్ ఆంటోనీస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి, ఆయన సతీమణి సునందరెడ్డిలు చేస్తున్న విద్యాసేవలను ప్రశంసించారు. రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, చిత్తాగిరి ప్రతీక్‌రెడ్డిలు ఆయనను ఘనంగా సన్మానించారు.

మద్దతు ధర అమలు చేయండి

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలను అమలు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఏడీఏ సురేష్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు పుత్తా లక్ష్మిరెడ్డి బుధవారం వినతిపత్రం ఇచ్చారు.

ఉత్తమ రైతుకు సత్కారం

చాపాడు: మండలంలోని రాజుపాళెం గ్రామానికి చెందిన ఉత్తమ రైతు లోమడ సదాశివారెడ్డిని బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఉగాది పండుగ సందర్భంగా గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లోమడ సదాశివారెడ్డిని ఉత్తమ రైతుగా ఎంపిక చేసి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా తమ మండలవాసి ఉత్తమ రైతుగా ప్రభుత్వం ఎంపిక చేయటం హర్షణీయమని కొనియాడారు.

ఏ ప్రభుత్వంలో మేలు జరిగిందో ఆలోచించండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఏ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందో ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని 1, 2 వార్డుల తోపాటు 34 నుంచి 41వ వార్డు వరకు సంబంధించిన డ్వాక్రా సంఘాల మహిళలతో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత సభ నిర్వహించారు. స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని రిషి అపార్ట్‌మెంట్ వద్ద నిర్వహించిన సభకు ఎమ్మెల్యే రాచమల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అన్నింటా మహిళలకు పెద్ద పీట వేసిందని తెలిపారు. ప్రతి పథకాన్ని మహిళల పేరుతోనే ఇస్తున్నారన్నారు. జగనన్న అమ్మ ఒడి, ఇళ్ల పట్టాలు, వైఎస్సార్ చేయూత, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన లాంటి పథకాలన్నీ మహిళల పేరుతో ఇస్తున్నట్లు చెప్పారు. కేవలం చంద్రబాబు లాగా ఎన్నికల సమయంలో ఈ పథకాలను ఏర్పాటు చేయలేదని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ముఖ్యమంత్రి జగన్ వీటిని అమలు చేశారన్నారు. నాడు పింఛన్ తీసుకోవాలంటే ఎన్ని రకాల ఇబ్బందులు పడేవారో గుర్తించాలని కోరారు. పింఛన్ పంపిణీ కేంద్రాల వద్ద వృద్ధులు మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కోట్ల రూపాయలను వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగేశ్వారెడ్డి, కౌన్సిలర్లు పందిటి సరోజ, ద్వార్శల భారతి, గంజికుంట రామసుబ్బమ్మ, పిట్టా బాలాజి, చింపిరి అనిల్ కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే సీఎం లక్ష్యం


వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బద్వేలు అర్బన్ : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారి ముఖాలో సంతోషం చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. బద్వేలు మండలానికి సంబంధించిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని 7 మండలాలలోని 3423 స్వయం సహాయక సంఘాలలోని 34,230 మంది మహిళలకు మూడవ విడత కింద రూ.26,48,39,725లు లబ్ధి చేకూరునుందని తెలిపారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.79,45,51,648లు మేర లబ్ధి చేకూరిందన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌తో పాటు అమ్మ ఒడి పథకం, దిశచట్టం వంటివి ఏర్పాటు చేశారన్నారు. అనంతరం మెగా చెక్కును విడుదల చేసి స్వయం సహాయక గ్రూపు సభ్యులకు అందజేశారు. అలాగే సభ్యులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, ఎంపీపీ బిజివేముల రమణమ్మ, మార్కెట్‌కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ రామకృష్ణయ్య, వెలుగు కో ఆర్డినేటర్ బి.వి.సుబ్బారెడ్డి, ఏపీఎం సుబ్రమణ్యం, సీసీలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన


ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, అధికారులు

మైదుకూరు : విద్యార్థులందరికీ సౌకర్యంగా ఉండే చోటనే పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం కాలేజీ ఏర్పాటు కోసం మైదుకూరులో పలు ప్రభుత్వ స్థలాలను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వం కొద్ది రోజుల కిందట ప్రభుత్వం మైదుకూరుకు పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్, ఓఎస్‌డీ పి.గురుమూర్తి రెడ్డి, తహసీల్దార్ అనురాధ తదితరులతో ఎమ్మెల్యే మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ వద్ద సర్వే నంబరు 827లోని స్థలాన్ని పరిశీలించారు. అలాగే తెలుగు గంగ కాలనీలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హైవే బైపాస్‌లో కోర్టుకు సమీపంలో సర్వే నంబర్లు 1124, 1126లలో ఉన్న స్థలాన్ని కూడా పరిశీలించారు. వీటిలో విద్యార్థులకు సౌకర్యంగా ఉన్న స్థలంలో పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఏపీ సుబ్బారెడ్డి, ఊటుకూరు రఘురామిరెడ్డి, కేపీ లింగన్న, కూశెట్టి రాయుడు, కిరణ్బాబు, వీరభద్రుడు, రామశివారెడ్డి, కరిడి రమణమూర్తి, భరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

సెల్ టవర్ నిర్మించొద్దని వినతి

ప్రొద్దుటూరు : ఆంధ్రకేసరి రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ వీధిలో సెల్ టవర్‌ను నిర్మించొద్దని కోరుతూ స్థానికులు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. రిటైర్డు ఏఎస్‌ఐ రాబర్ట్ ఇమ్మానుయేల్ తన ఇంటి పైభాగంలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పలుమార్లు సెల్‌టవర్ నిర్మాణంపై అభ్యంతరం చెప్పినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, చర్చిలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాల్లోని పునాదుల పూడ్చివేత

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని అమృతానగర్‌కు చెందిన ఆక్రమిత స్థలాల్లో వేసిన పునాదులను ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పూడ్చివేశారు. కాలనీలోని 9, 18 వీధుల్లో దాదాపు 13 ప్లాట్లను ఇతరులు కొనుగోలు చేసి పునాదులు తవ్వారు. ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు ఈ పునాదులను బుధవారం జేసీబీతో పూడ్చివేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వీఆర్‌ఓలు భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకటకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అధికారులతో మాట్లాడుతూ అమృతానగర్‌లో స్థలాలు ఎక్కువగా ఆక్రమణకు గురవుతున్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. బుధవారం మండలంలోని బేతాయపల్లె సచివాలయం పరిధిలో ప్రాజెక్టుకాలనీ-1, ప్రాజెక్టుకాలనీ-2, పి.పి.కుంట గ్రామాల్లో ఆమె గడప గడపకు తిరిగి ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు డ్వాక్రా రుణమాఫీతో పాటు వడ్డీ బకాయిలను కూడా చెల్లించిందన్నారు. అంతేకాకుండా 45 సంవత్సరాలు నిండిన అన్ని వర్గాలకు చెందిన మహిళలకు రూ.18 వేలు వారి ఖాతాలో జమ చేశారన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ఏ ఒక్క సంక్షేమ పథకం ఆగకుండా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నాలుగేళ్ళ పాలనలో కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్‌ను అందించారు. మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరనుందన్నారు. ప్రతి ఒక్కరు జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు నరసింహారెడ్డి, వెంకటరమణ, వెంకటేష్, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవిందనాయక్ పాల్గొన్నారు.

స్వామిత్వలో వివరాలన్ని నమోదు

బద్వేలు : ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న స్వామిత్వ సర్వేను ఎటువంటి తప్పుల్లేకుండా ఆస్తి వివరాలను నమోదు చేసేలా పంచాయతీ కార్యదర్శులు సన్నద్ధం కావాలని బద్వేలు డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు రంగసముద్రం ఎస్‌డబ్ల్యూపీసీల్లో స్వామిత్వపై ప్రత్యేక శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు ఈఓపీఆర్డీ భానుప్రకాష్, రీసోర్స్ పర్సన్, పంచాయతీ కార్యదర్శి ఆరుణ్ శిక్షణ చేయాల్సిన విధానం, అనుసరించాల్సిన నిబంధనలు, నిర్వహించాల్సిన రికార్డులను వివరించారు. అన్ని వివరాలను పూర్తిగా నమోదు చేయాలన్నారు. డీఎల్‌పీఓ రమణారెడ్డి మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో అన్ని అంశాల్లో పోరుమామిళ్ల మొదటి స్థానంలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కర్‌బాబు, ఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమంతో పాటు అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. బి.కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని శ్రీనివాసాపురం గ్రామ నూతన తారురోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా కొత్త రోడ్డు నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారని, వారి విజ్ఞప్తి మేరకు రూ. 62 లక్షలతో నూతన రహదారి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీటీసీ ముమ్మడి స్వప్న, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చాపాడు : మండలంలోని టీకపల్లె గ్రామంలోని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోతురాజు అంకాలమ్మ దేవాలయ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ఎంపీపీ లక్షుమయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

బద్వేలు అర్బన్ : క్షయవ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి క్షయవ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని టి.బి. యూనిట్, ఐసీటీసీ సెంటర్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.

రామాయణాన్ని ప్రతి ఒక్కరూ వినాలి


మాట్లాడుతున్న టీటీడీ పాలకమండలి సభ్యుడు చిప్పగిరి ప్రసాద్

ప్రొద్దుటూరు కల్చరల్ : రామాయణాన్ని ప్రతి ఒక్కరూ వినాలని, చదవాలని టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్ తెలిపారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో దేవదాయశాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న రామాయణ సప్తాహం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా టీటీడీ పాలకమండలి సభ్యుడు మాట్లాడుతూ రామాయణం ఒక వ్యక్తి ఎలా జీవించాలో తెలియజేస్తుందన్నారు. ప్రొద్దుటూరు జిల్లాలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమని తెలిపారు. విద్వాన్ డాక్టర్ మూలె రామమునిరెడ్డి శ్రీరామాయణం - జాతికి సందేశం అనే అంశంపై ఉపన్యసించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు మారుతిప్రసాద్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. భక్తులకు టీటీడీ వారు అందించిన కంకణాలు, పుస్తకాలను పంపిణీ చేశారు.

బస్సు సౌకర్యంపై హర్షం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజుపాళెం : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి రాజుపాళెం, బాగలమర్రి మీదుగా హైదరాబాదుకు అధికారులు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజుపాళెంలో బుధవారం పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, నాయకులు మధుసుదన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలు విలేకరులతో మాట్లాడారు. మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్యటించినప్పుడు ఆయా గ్రామాల్లోని ప్రజలు ఈ విషయమాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారన్నారు. వెంటనే ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడారన్నారు. ఈ నెల 31వ తేదీ శుక్రవారం నుంచి ఆర్టీసీ బస్సు ప్రొద్దుటూరు నుంచి రాజుపాళెం మీదుగా హైదరాబాదుకు బస్సు సర్వీసు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అలాగే ఎమ్మెల్యే రాచమల్లుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు

బద్వేలు అర్బన్ : వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను అభివృద్ధి పరుస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఏర్పాటు చేసిన బద్వేలు బ్రాంచ్ నూతన ప్రాంగణాన్ని బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సహకార బ్యాంకుల సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు మాట్లాడుతూ సహకార బ్యాంకుల ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇచ్చి సహకార బ్యాంకులను బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తావిజయప్రతాప్‌రెడ్డి, పీఆర్ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు రాజారామ్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, డీసీసీ బ్యాంకు సీఈఓ కె.రాజేంద్రకుమార్, డీజీఎంలు బాలిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బద్వేలు శాఖ మేనేజర్ కళావతి, అసిస్టెంట్ మేనేజర్ నారాయణరెడ్డి, ఆయా మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై సమావేశం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డాక్టర్ సమీర ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై అంగన్‌వాడీ కార్యకర్తలు, స్కూల్ టీచర్లతో సమావేశం నిర్వహించారు. మండల నోడల్ అధికారి ప్రమీలమ్మ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తల్లీ పిల్లల ఆరోగ్యం, పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు, అంటు వ్యాధుల గురించి ప్రజలకు చెప్పాలన్నారు. ఆరోగ్య విద్యాధికారి కుమారి మాట్లాడుతూ గత ఐదేళ్ల కిందట ఆడ, మగ పిల్లల నిష్పత్తిలో తేడాలు ఉన్నాయని, ప్రతి వెయ్యి మంది మగ పిల్లలకు 820 మంది ఆడ పిల్లలు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి వెయ్యి మంది మగ పిల్లలకు 995 మంది ఆడ పిల్లలు ఉన్నారని ఆమె చెప్పారు.

విద్యాసామగ్రి పంపిణీ

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వీరపోగు రవి, చెరుకూరి రవికుమార్‌లు బుధవారం పంపిణీ చేశారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశామన్నారు.

ఆకుకూరలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : గర్భిణులు, బాలింతలు రోజూ తగిన మోతాదులో ఆకు కూరలను తీసుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్ వైజర్ నాగేశ్వరి తెలిపారు. దస్తగిరిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు.

మామిడి తోటల పరిశీలన


తోటలో తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అట్లూరు : మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం(బాలిరెడ్డిబావి)గ్రామ పొలాలలోని మామిడి తోటలను బుధవారం కేవీకే వనిపెంట అధిపతి మరియూ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీవిద్యారాణి, ఉద్యాన శాస్త్రవేత్త ఎస్.ఫిరోజ్‌హుస్సేన్‌లు పరిశీలించారు. మామిడి తోటలలో కాండం తొలుచు పురుగు, ఆకుజల్లెడ, గూడుపురుగు మరియూ కొమ్మ ఎండుతెగులు సమస్యలను గుర్తించారు. వాటి నివారణకు అవసరమైన మందులను సిఫార్సు చేశారు. రైతులకు ముందస్తుగా తెగుళ్లను ఎలా పసిగట్టి వాటి నివారణ చర్యలను చేపట్టాలన్న అంశాలను వివరించారు.

రేపు న్యూ కేటగిరీ బండలాగుడు పోటీలు

రాజుపాళెం : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజుపాళెంలో 31వ తేదీ శుక్రవారం న్యూ కేటగిరీ బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో గెలుపొందిన ఎద్ల యజమానులకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.50,000, రూ.40,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000, రూ.5,000 లు ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీలను తిలకించడానికి వచ్చిన వారికి టీటీడీ కల్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఆయా గ్రామాల్లోని ప్రజలంతా వచ్చి ఈ బండలాగుడు పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు ఈకేవైసీ నమోదుకు చివరి అవకాశం

గోపవరం : ఈకేవైసీ నమోదుకు శుక్రవారంతో గడువు ముగియనుందని వ్యవసాయాధికారి అరవిందనాయక్ తెలిపారు. ఈకేవైసీ, ఎంపీసీఐ లింక్ లేని రైతుల జాబితాలను ఆయా రైతుభరోసా కేంద్రాల్లో ఉంచడం జరిగిందన్నారు. ఈకేవైసీ నమోదు చేయించుకోని రైతులకు పీఎం కిసాన్ పథకం వర్తించదన్నారు. మండల వ్యాప్తంగా 450 మంది రైతులు ఇప్పటి వరకు ఈకేవైసీ, ఎంపీసీఐ లింక్ చేసుకోలేదని తెలిపారు. ఈకేవైసీ నమోదు చేయించుకోని రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాలకు వెళ్ళి వ్యవసాయ సిబ్బంది, వలంటీర్లను సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

• ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


చాపాడులో సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

చాపాడు : రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన మహిళలందరినీ అభివృద్ధి చేసి వారిని లక్షాధికారులు చేయటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు మహిళలను మోసం చేస్తే.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్షాధికారులను చేస్తున్నారన్నారు. మూడవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని బుధవారం చాపాడులో పండుగలా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి నుంచి మహిళలందరూ ర్యాలీ చేస్తూ కోలాటం ఆడుతూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. కిలో మీటరు మేరకూ సీఎం జగన్ ఫ్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. వీరికి మద్దతుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం స్థానిక వైఎస్ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని 762 మహిళా సంఘాలకు రూ.5.35కోట్ల ఆసరా చెక్కు, రూ.1.39 కోట్ల సున్నా వడ్డీ చెక్కును పంపిణీ చేశారు. సీఎం జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మహిళలు జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపించారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని మహిళలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మహిళనుద్దేశించి మాట్లాడుతూ.. 2014లో ఎన్నికల్లో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మహిళలను మోసం చేస్తే.. అప్పటి నుంచే మహిళల రుణాలన్నీ నాలుగు విడతల్లో చెల్లిస్తానని సీఎం కాగానే వైఎస్ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారన్నారు. మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తే డబ్బును వృథా చేస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. అనంతరం మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన జమీలా తన కుటుంబానికి జగన్ ప్రభుత్వంలో జరిగి లబ్ధిని తోటి మహిళలకు తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, జెడ్పీటీసీ తేస్దాది రాజి, సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దారు సుభానీ, డ్వాక్రా ఏరియా కో ఆర్డినేటర్ లావణ్య, ఏపీఎం వెంకటరమణ, గ్రామ సచివాలయ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జయరామిరెడ్డి, ప్రసాద్, జయసుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.